నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 5 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# వివేక్‌కు రైతుల బాధలు పట్టవా..?

- అధికారమిస్తే ముంపు బాధితుల గురించి మాటాడినవా
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్

భీమారం, ఆగస్టు 4 : వివేక్‌కు అధికారమిస్తే కనీసం రైతుల బాధలు పట్టించుకున్నది లేదని, కనీసం అసెంబ్లీలో ముంపు బాధితుల గురించి మాట్లాడలేక పోయారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్ నియోజకవర్గ వ్యాప్తంగా మహిళా భవనాలు, గ్రంథాలయాలకు రూ. 40 కోట్లు తీసుకొస్తే.. ఏమాత్రం అవగహన లేని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆ నిధులను మురుగు కాల్వ పనులకు వాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికారం లేక ముందు ముంపు గ్రామాల్లో కరకట్టలు నిర్మించాలని, రైతులకు పంట నష్టం పరిహారం ఇవ్వాలంటూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, గద్దెనెక్కగానే ఆ విషయాన్నే మరచిపోయారని మండిపడ్డారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఊర చెరువు మరమ్మతుల కోసం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రూ. 79 లక్షలు ప్రొసీడింగ్ చేస్తే, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆ నిధులు వృథాగా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, నాయకులు వడ్ల కొండ కిష్టయ్య, ఆకుదారి మధు , తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణం..శుభప్రదం

- నేటి నుంచి పవిత్ర మాసం ప్రారంభం
- నెల పాటు ఆధ్యాత్మిక వాతావరణం
- ప్రతి మంగళ వారం గౌరీ వ్రతాలు
- సోమవారాలు ప్రత్యేక పూజలు, శివారాధనలు..
- ప్రతి శుక్రవారం నోములు
- చెట్లతీర్థాలతో ఊరూరా సందడి
- పుణ్యక్షేత్రాలకు పోటెత్తనున్న భక్తులు



గూడెం సత్యనారాయణస్వామి దేవాలయం, గుట్టపై కొలువైన రమాసహిత సత్యనారాయణస్వామి



**చెన్నూర్ టౌన్/దండేపల్లి, ఆగస్టు 4 : సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండగా, ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటున్నది. పూజలు, పునస్కారాలు, వ్రతాలకు ఈ నెల పెట్టింది పేరు కాగా, ఇంటింటా సందడి నెలకొంటోంది. చెట్ల తీర్థాలు, వనభోజనాల పేరిట భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానుండగా, ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నీ కిటకిటలాడే అవకాశమున్నది.**

### విశిష్టతల మాసం..

శ్రావణం.. ఆధ్యాత్మిక మాసం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో శ్రావణ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. అందుకే ఈ మాసాన్ని శుభాల మాసం.. పండుగల మాసమనిని అంటారు. ముఖ్యంగా శ్రవణ నక్షత్ర ప్రవేశంతో వచ్చేదే శ్రావణ మాసం. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం.. శ్రీనివాసుడి జన్మ నక్షత్రం కూడా శ్రావణమే.. శ్రీకృష్ణుడు అవతరించింది శ్రావణ మాసంలోనే.. బలిచక్రవర్తికి పట్టాభిషేకం జరిగిన మాసం.. భక్తి మార్గాల్లో శ్రవణ భక్తి మొదటిది. శ్రవణ నక్షత్రానికి అధిపతి శివుడు ఈ మాసంలో శ్రీ మహావిష్ణువును పూజిస్తాడని ప్రతీతి. అందుకే శ్రావణ మాసం ప్రత్యేకతను సంతరించుకుంది.

### సోమవారం..

ముక్తిప్రదాత శివుడికి ప్రీతికరమైన రోజు. సోమవారం శివుడిని పూజిస్తే శివకటాక్షాన్ని పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి. లింగస్వరూపుడైన శివుడిని పంచామృతాలతో అభిషేకించి బిల్వ పత్రం సమర్పిస్తే ఆయుష్షు పెరిగి..పాపాలు తొలగుతాయని నమ్మకం.

### మంగళ వారం

అభయమిచ్చే ఆంజనేయుడు.. సకల విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు మంగళవారం జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రావణ మాసంలో ఆయా దేవతలను ఆరాధిస్తే వారు శుభాలను ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం.

### బుధవారం

హరిహర సుతుడైన అయ్యప్పను బుధవారం కొలుస్తారు. శ్రావణ బుధవారాల్లో అయ్యప్ప పూజ విశేష ఫలితాన్నిస్తుందని పండితులు చెబుతారు. సర్వకార్య అనుకూలత, శివ కేశవుల కటాక్షం పొందేందుకు అయ్యప్పకు అభిషేకం చేయాలని సూచిస్తారు.

### గురువారం

ఈ రోజు దక్షిణామూర్తిని కొలుస్తారు. అభిషేకం చేసి బిల్వపత్రం సమర్పిస్తే దక్షిణామూర్తి స్వామివారు సంతృప్తిచెందుతారని, పచ్చి శెనగల దండను సమర్పిస్తే కరుణా కటాక్షాలను వర్షిస్తాడని చెబుతారు.

### శుక్రవారం

శ్రావణ శుక్రవారం వ్రతమాచరిస్తే అమ్మవారి కరుణా కటాక్షాలు లభిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. మంగళగౌరీ వ్రతం, మహాలక్ష్మీవ్రతం, ఆచరించేవారికి శ్రావణ శుక్రవారం ఎంతో విశిష్టమైనదిగా భావిస్తారు. అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, అల్లిన మల్లెదండను సమర్పిస్తే సకల పాపాలు తొలగుతాయన్నది భక్తుల విశ్వాసం. రుణ విముక్తి, లక్ష్మీ కటాక్షం, సౌభాగ్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

### శనివారం

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కొలిస్తే కోరిన వరాలిస్తాడన్నది భక్తుల విశ్వాసం. ఆయనకు ప్రీతికరమైన రోజు శనివారం. స్వామివారికి పుష్పార్చన, తులసీ మాల సమర్పిస్తే శుభం కలుగుతుందని పండితులంటున్నారు.

### ఆదివారం

ప్రత్యక్ష భగవానుడు ఆదిత్యుడికి ప్రీతికరమైన రోజు. సూర్యుడు నమస్కార ప్రియుడు. ఆయనకు భక్తితో నమస్కరిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని, ఆరోగ్య భాగ్యాన్ని ప్రసాదిస్తాడని భక్తులు నమ్ముతారు.

### శ్రావణ మాసంలో వచ్చే పండుగలు.. :

శ్రావణమాసంలో మొదటి పండుగ మంగళ గౌరీ వ్రతం. ఆ తర్వాత నాగ, గరుడ పంచమిలు, నారసింహ వ్రతం, వరలక్ష్మీ వ్రతం, శ్రావణ (జంధ్యాల), రాఖీ పూర్ణిమ, హయగ్రీవ జయంతి, గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు, శ్రీకృష్ణ జన్మాష్టమి ఈ నెలలోనే వస్తాయి. శ్రావణ సోమవారాలు కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### మంగళ గౌరీ వ్రతం

ప్రతి మంగళవారం, శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ముత్తయిదువలు, పెండ్లికాని యువతులు ఆచరించే మంగళగౌరీ వ్రతం అత్యంత విశేషమైంది. అమ్మవారిని షోడశోపచారాలతో, అష్టోత్తర శతనామాలతో పూజిస్తారు. పసుపు, బంగారం, వెండితో గౌరమ్మను పూజిస్తే సుఖ సంపదలు వస్తాయని నమ్మకం. పెండ్లికాని వారికి వివాహం అవుతుందని ప్రగాఢ విశ్వాసం. చివరి వారంలో పసుపు, కుంకుమలతో వాయినాలు సమర్పించుకుంటారు.

### నాగుల పంచమి

శ్రావణ శుద్ధ చవితి, పంచమి రోజున నాగుల చవితి, పంచమిని జరుపుకుంటారు. ఈ రెండు రోజులతో పాటు, శ్రావణ శనివారాల్లో పెద్దలు, పిల్లలు పుట్టలో పాలుపోసి భక్తిశ్రద్ధలతో నమస్కరిస్తారు. నాగముద్రికలను సమర్పించుకుంటారు. ఇలా చేస్తే సర్వ దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

### వరలక్ష్మీ వ్రతం

నిత్య సౌభాగ్యం కోసం మహిళలు ఆచరించే వ్రతాల్లో వరలక్ష్మీ వ్రతం ఒకటి. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ప్రత్యేకంగా అమ్మవారికి కుంకమార్చనలు చేస్తారు. అష్ట ఐశ్వర్యాలు, సౌభాగ్యాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని కోరుకుంటారు.

### శ్రావణ పూర్ణిమ

శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమనే శ్రావణ పూర్ణిమ అంటారు. రక్షాబంధన్, జంధ్యాల పౌర్ణమిగా జరుపుకుంటారు. ఇదే రోజున హయగ్రీవ, సంతోషీమాత జయంతి కూడాకావడం విశిష్టత. మాతను ఆరాధించడం ద్వారా సకల పాపాలు తొలగి శుభాలు కలుగుతాయన్నది హిందువుల నమ్మకం.

### శ్రీకృష్ణాష్టమి

శ్రావణ కృష్ణపక్ష అష్టమి రోజున శ్రీకృష్ణుడి జన్మాష్టమిగా జరుపుకుంటారు. ఒక్క కృష్ణాష్టమి వ్రతాన్ని నిష్ఠతో ఆచరిస్తే సంవత్సరంలో 24 ఏకాదశి వ్రతాలు చేసిన పుణ్యఫలం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ రోజున పల్లె, పట్టణాల్లో ఉట్టి సంబురాలు, చిన్నారులను గోపికలు, చిన్ని కృష్ణులుగా అలంకరించి మురిసిపోతారు.

### మహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం



శ్రావణమాసం మహావిష్ణువు, ఆయన సతీమణి మహాలక్ష్మీ అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన మాసంగా పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ నెలలో వివిధ రకాల పూజలు, వ్రతాలు ఆచరిస్తారు. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుంది. శ్రావణం అందరికీ ప్రీతిపాత్రమైనది. మంచిరోజులు కావడంతో శుభకార్యాలు అధికంగా నిర్వహిస్తుంటారు.

**- వేమారపు మహేశ్వర శర్మ, అర్చకుడు, చెన్నూర్**

# సుప్రీం తీర్పు నమ్మకాన్ని పెంచింది

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ**


మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కాసిపేట, ఆగస్టు 4 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు న్యాయమైన ముగింపునిచ్చిందని, ఈ తీర్పు న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ పేర్కొన్నారు. ఆదివారం సోమగూడెంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ 30 ఏండ్ల కల నెరవేరుతున్నదన్నారు. మందకృష్ణ నాయకత్వంలో మాదిగ జాతి అలుపెరగని పోరాటం చేసిందని, దీనికి సమాజంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల మద్దతు లభించిందన్నారు. నాయకులు దాసరి రాంచేందర్, కొండ్రా తిరుపతి, ఉప్పులేటి శ్రీనివాస్, కుక్క రాంచేందర్, లంక లక్ష్మణ్, చిలుముల పోశం, బూడిది రమేశ్, వేమూర్ల వెంకటేశ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ తీస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

### కాగజ్‌నగర్‌లో ర్యాలీ

కాగజ్‌నగర్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తాలో ర్యాలీ ప్రారంభించగా, ప్రధాన వీధుల గుండా సాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, ఆపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనాలు


తాండూర్: శ్రీవాణినికేతన్ పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు


మందమర్రిలో అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


మంచిర్యాల : అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచిర్యాల అర్బన్/మందమర్రి/తాండూర్, ఆగస్టు 4 : జిల్లాలో పలుచోట్ల ఆదివారం అపూర్వ సమ్మేళనాలు నిర్వహించారు. నస్పూర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంచిర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, మందమర్రి పట్టణంలోని శ్రీరాఘవేంద్ర ఉన్నతపాఠశాలకు చెందిన 2001-02 పదోతరగతి బ్యాచ్, తాండూర్ మండల కేంద్రంలోని శ్రీవాణినికేతన్ పాఠశాలలో 2002-2003కు చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాలు నిర్వహించారు. ఫ్రెండ్‌షిప్ డే నాడు అందరూ ఒకేచోట చేరి.. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటాపాటలతో సందడి చేశారు. సహపంక్తి భజనాలు చేశారు. తమకు పాఠాలు బోధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయా చోట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ధూళిపాల కాశీ విశ్వనాథం, పూదరి సత్యనారాయణ, దుద్దిల్ల రాంమోహన్‌రావు, వెన్నముద్దల సతీశ్, సదయ్య, విజయ్ కుమార్, మల్లయ్య, నగేశ్, రాజు, పూర్వ విద్యార్థులు మహేందర్, మాయ రమేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, జ్యోతి ఉన్నారు.

## వైభవంగా ఆదిపరాశక్తి బోనాల జాతర


బోనాల జాతరకు తరలివచ్చిన భక్తులు

సీసీసీ నస్పూర్, ఆగస్టు 4: సీసీసీ నస్పూర్‌లో ఆదివారం ఆదిపరాశక్తి బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. ఆదిపరాశక్తి భువనేశ్వరి మాతా దేవాలయ కమిటీ అధ్యక్షుడు వంగల దయానంద్, వంగల వివేకానంద్ ఆధ్వర్యంలో సామూహిక ఆషాఢమాస బోనాల జాతరు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీసీసీ కార్నర్ వద్ద ఆలయ పూజారులు రఘు మహారాజ్, సాయిప్రసన్న పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ఊరేగింపు ప్రారంభించారు. సీసీసీ కార్నర్ నుంచి తిరుమల టాకీస్ మీదుగా తీగల్‌పహాడ్ రాంనగర్‌లోని ఆదిపరాశక్తి ఆలయం వరకు సాగింది. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డప్పుచప్పుళ్లు, డీజే పాటల నడుమ భక్తులు నృత్యాలతో హోరెత్తించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మహిళల కోలాటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కౌన్సిలర్ బేర సత్యనారాయణ మొక్కులు తీర్చుకున్నారు. సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఐ నెల్కి సుగుణాకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కవ్వాల్ అందాలు


కవ్వాల్‌లోని బైసన్ కుంట


బేస్ క్యాంప్ సమీపంలో ప్రవహిస్తున్న వాగు

జన్నారం, ఆగస్టు 4 : కవ్వాల్ అడవులు అందాలకు నెలవుగా మారాయి. పక్షుల కిలకిల రావాలు.. వన్యప్రాణుల సయ్యాటలు.. వంకలు తిరిగే రోడ్లు చూడముచ్చటగొలుపుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోండుగూడ బేస్‌క్యాంప్ సమీపంలోని వాగు జల సవ్వడితో కనువిందు చేస్తుండగా, మల్యాల అడవుల మధ్యనున్న బైసన్ కుంట ఆకట్టుకుంటున్నది.

# ఆగని అక్రమ దందా

- మహారాష్ట్ర నుంచి జిల్లాకు జోరుగా దేశీదారు, గంజాయి, గుట్కా రవాణా
- బార్డర్ చెక్‌పోస్టు అధికారుల చేతివాటమే కారణమంటూ ఆరోపణలు
- ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నిషేధిత వస్తువులు
- పలువురిపై కేసులు నమోదు


జూలై 20న మహారాష్ట్ర నుంచి దేశీదారు తరలిస్తూ పట్టుబడ్డ వాహనం


జూలై 21న జైనూర్ కాలేజీగూడ దగ్గర గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ వాహనం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో జోరుగా అక్రమ దందా సాగుతున్నది. కొందరు వ్యాపారులు మహారాష్ట్ర నుంచి చెక్‌పోస్టులను దాటుకొని పశువులు, దేశీదారు, గంజాయి, గుట్కావంటివి యథేచ్ఛగా సరఫరా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. వాంకిడి సరిహద్దులోని చెక్‌పోస్టును దాటుకొని నిషేధిత పదార్థాలు తీసుకొచ్చే వాహనాలు జిల్లాలోకి ఎలా ప్రవేశిస్తున్నాయనేది ప్రశ్నార్థకంగా మారుతున్నది. అయితే, చెక్‌పోస్టు సిబ్బందే కాసుల కోసం కక్కుర్తి పడి వాహనాలను తనిఖీ చేయకుండానే వదిలేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, ఇటీవల జరిగిన పలు ఘటనలను చూస్తే ఆ ఆరోపణలకు బలం చేకూరుతున్నది. ఇటీవల పోలీసులు నిఘా గుట్కా, దేశీదారు. గంజాయి, పశువులను పట్టుకొని పలువురిపై కేసులు నమోదు చేశారు.

- జూలై 19న : జైనూర్ మండలం జంగాంకు చెందిన హూర్ మహదేవ్ అనే వ్యాపారీకి చెందిన గోదాంలో రూ.29,120 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి యథేచ్ఛగా సరఫరా అవుతున్న గుట్కా ప్యాకెట్లను మారుమూల పల్లెలకు తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.
- జూలై 20న : కాగజ్‌నగర్‌లోని గాంధీనగర్ బస్తీలో పోలీసులు తనిఖీలు చేపట్టి రూ. 95 వేల విలువగల దేశీదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి కారులో తీసుకొస్తున్న 1590 (90 ఎంఎల్) దేశీదారు మద్యం బాటిళ్లను పట్టుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.
- జూలై 21న : జైనూర్ మండల కేంద్రంలోని కాలేజీగూడ దగ్గర చేపట్టిన వాహనాల తనిఖీల్లో జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న కారును తనిఖీచేయగా అందులో 1.5 కిలోల గంజాయి పట్టుబడింది. కారు డ్రైవర్ మొహ్మద్ గులాబ్‌ను విచారించగా, జైనూర్‌లోని అబ్బాస్ వద్ద కొనుగోలు చేసి కెరమెరిలో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 37 వేలు ఉంటుందని అధికారులు గుర్తించారు. గులాబ్‌పై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు.
- జూలై 24న : కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విలేజ్ నంబర్-8లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. దిలీప్‌కుమార్ మండల్ ఇంట్లో తనిఖీలు చేయగా, రూ. 6 వేల విలువ చేసే 200 గ్రాముల గంజాయి దొరికింది. నిందితుడిని విచారించగా మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చినట్లు చెప్పాడు.
- జూలై 26న : కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. 15 ఎద్దులు, 8 గేదెలను అదుపులోకి తీసుకొని నలుగురిపై కేసు నమోదు చేశారు.

### గట్టి నిఘా పెట్టాం..



జిల్లాలో అక్రమ రవాణాకు పాల్పడితే ఊరుకునేది లేదు. గట్టి నిఘా పెట్టాం. నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. గుట్కా, దేశీదారు, గంజాయివంటి నిషేధిత వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రజలు కూడా సహకరించాలి.

**- డీవీ శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ**

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679